కాలిబాటలు కనుమరుగు




- దర్జాగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- దుకాణాల ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్న ఆక్రమణదారులు
- అసలే అంతంతమాత్రంగా రోడ్లు
- పాదచారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

సింధియా: ఫుట్‌పాత్‌లు వ్యాపార కేంద్రాలుగా మారాయి. పాదచారుల భద్రత, సౌలభ్యం కోసం కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన కాలిబాటలు వ్యాపారుల చెరలో ఉంటున్నాయి. దీంతో పాదచారులు వాహనాల మధ్య ప్రమాదకర పరిస్థితుల్లో రోడ్లపై నడవాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..

గాజువాక మొదలుకుని శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా వరకు సుమారు 7 కిలోమీటర్ల వరకు ఉన్న ఫుట్‌పాత్‌లపై బట్టలు, చెప్పులు, చిరుతిండ్లు, కూరగాయలు, పండ్లు తదితర చిన్నాచితకా వ్యాపారాలు చేసేవారు తిష్ట వేశారు. మరి కొందరు ఏకంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి, దర్జాగా అద్దెలకూ ఇచ్చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో వీధి వ్యాపారాలు చేసేవారి సంఖ్య బాగా పెరిగిపోయింది. కొందరు షాపుల యజమానులు ఈ


ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు

ఫుట్‌పాత్‌లను వాహనాల పార్కింగ్ స్థలాలుగా వాడుకుంటున్నారు. షాపింగ్ చేసే సమయాల్లో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు సైతం ఫుట్‌పాత్‌లపై నిలపడంతో పాదచారులు నడిచేందుకు కనీస స్థలం లేక నానా అవస్థలు పడుతున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉండే రోడ్లు ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో మరింత ఇరుగ్గా మారుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలతో పాటు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు మాత్రం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ముడుపుల మత్తులో ఆక్రమణదారులకు కొమ్ము కాస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చిరు వ్యాపారాలతో మొదలు..

ఫుట్‌పాత్ స్థలాల్లో తాత్కాలికంగా చిరువ్యాపారాలను ప్రారంభించి, తర్వాత నెమ్మదిగా పటిష్టమైన షెడ్లు, దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపార కేంద్రాలుగా మార్చేస్తున్నారు. దీంతో రోడ్లు కుదించుకుపోయి ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగించేవారు తెల్లవారుజాము నుంచే వ్యాపారం మొదలు పెడుతుండడంతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రోడ్లపై ట్రాఫిక్ కిక్కిరిసిపోతోంది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో స్కూల్స్‌కి, కాలేజీలకి, ఉద్యోగాలకి వెళ్లేవారు అధికంగా ఉండడంతో ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని ఆలస్యంగా వెళ్లవలసిన పరిస్థితి. ఇక ఆస్పత్రికి వెళ్లేవారైతే చెప్పాల్సిన పనే లేదు. ఇటీవల ఒక మహిళ గుండె నొప్పితో బాధపడుతూ ఆంబులెన్స్‌లో నగరంలోని ఆస్పత్రికి వెళ్లే సమయంలో ఆ మార్గం గుండా ప్రయాణిస్తున్న సమయంలో తీవ్ర ఆలస్యమై, ఆమె మార్గమధ్యంలోనే మరణించింది.


మల్కాపురం నుంచి సింధియా వరకు ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారాలు

వారి అండతోనే..

స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతోనే ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు వెలుస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై వెలుస్తున్న దుకాణాలకు విద్యుత్‌మీటర్ల ఏర్పాటు, ప్రారంభోత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరుకావడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

తొలగించిన చోటే మళ్లీ ఆక్రమణలు

గతంలో పలుమార్లు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించినా, తిరిగి అదేచోట దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. తెలిసిన వారివి, ముడుపులు చెల్లించిన వారి దుకాణాలను తొలగించకుండా యథాతథంగా వదిలేయడంతో మిగిలిన వారు కొద్ది రోజులు తరువాత తిరిగి ఆ స్థానంలో దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, ఫుట్‌పాత్ వ్యాపారాల కట్టడికి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంటోంది



నేను రోజూ మల్కాపురం నుంచి సింధియా వరకు వాకింగ్ చేస్తూ ఉంటాను. ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఉండడంతో రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలను పార్క్ చేయడం వల్ల రోడ్డు ఇరుకై నడవడానికి చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లను క్లియర్ చేయాలి.

– కొట్యాన రవి, మల్కాపురం

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వల్ల రోడ్లు రద్దీగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నాం. దుకాణాలను తొలగించి సీజ్ చేస్తే గానీ ఫుట్‌పాత్‌ల ఆక్రమణ ఆగదు. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– సత్యనారాయణ, మల్కాపురం

క్లుప్తంగా

పారదర్శకంగా పీ-4 సర్వే


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ చిన్నా

సింధియా: పబ్లిక్, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం(పీ4) సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా సూచించారు. వార్డులోని మూడు సచివాలయాల సిబ్బందితో మంగళవారం చింతల్లోవ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. అట్టడుగున ఉన్న నిరుపేద వర్గాలను నిర్దేశిత సూచికల ఆధారంగా గుర్తించాలన్నారు. పక్కా ఇళ్లు, విద్యుత్, బ్యాంకు అకౌంట్, గ్యాస్ కనెక్షన్ వంటివి లేనివారిని గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే సర్వే ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు.

ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


మల్కాపురం సేవామార్గంలో వేసిన ఎల్ఈడీ లైట్లు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక గల మార్గంలో విద్యుత్ ఎల్ఈడీ లైట్లు ఎట్టకేలకు వేశారు. ఈ మార్గంలో వీధిదీపాలు వెలగకపోవడంతో అంధకారంతో ప్రజలు అవస్థలు పడేవారు. ఈ సమస్యపై మంగళవారం 'సాక్షి' దిన పత్రికలో అంధకారంలో సేవా మార్గం అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులు స్పందించారు. ఆ మార్గంలో వెలగని ఎల్ఈడీ లైట్లు తొలగించి కొత్త వాటిని అమర్చారు. దీంతో ఆ ప్రాంత వాసులు జీవీఎంసీ విద్యుత్ సిబ్బందితో పాటు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో మంగళవారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగస్థలం వేడుకల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న ఆంధ్ర యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు ఆవిష్కరించారు. యూనవర్సిటీ ప్రాంగణంలోని డాక్టర్ కేవీ గోపాలస్వామి ఓపెన్ థియేటర్‌లో తులసి తీర్థం నాటిక, అల్లూరి సీతారామరాజు బుర్రకథ, హాస్య గుళికలు వేణుగానం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు తెలిపారు. రంగస్థలం వైభవాన్ని చాటేలా వేడుకలు నిర్వహించాలని వీసీ ఆచార్య రాజశేఖర్ సూచించారు. రంగస్థలం ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ మరపట్ల భాస్కరరావు, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ త్రినాథరావు, పితాని ప్రసాద్, సంబంగి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

'ఇన్సూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించాలి'

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగుల గ్రూప్ మెడికల్ ఇన్స్యూ పాలసీ ప్రీమియమ్‌ను సకాలంలో చెల్లించాలని ఉక్కు విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు గుడే సుశీలా గజేంద్రరావు, జి.బోసుబాబ బి.భాస్కరరాజు, ఎస్‌ఎం.రఫీ కోరారు. ఈనెల 27లోగా నగదు చెల్లించని పక్షంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయా కుటుంబాలు ఆరోగ్య బీమా రక్షణ కోల్పోయే పరిస్థితి ఉందని వాపోయారు. ఉక్కు యాజమాన్యం తక్షణమే స్పందించి నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. గడువులోగా ప్రీమియం చెల్లించని పక్షంలో విశ్రాంత ఉద్యోగులకు భారీ నష్టం జరుగుతుందన్నారు.

అనంత్‌కు ఘన సత్కారం


పీలా అనంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న పీలా అనంత్‌కుమార్‌కు మంగళవారం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన అనంత్‌కుమార్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిగా ఉంటూ వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక పాత్ర పోషించే వారు.స్థానిక గౌరీ సేవా సంఘం ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ప్లాంట్‌లో కూడా కార్మికుల సమస్యలపై తన దైన శైలిలో పని చేశారు. ఈ నెలాఖరున ఉద్యోగవిరమణ అవుతుండడంతో స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్,నీరుకొండ రామచంద్రరావు తదితరులు అనంత్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు,ఐఎన్‌టీయూసీ,వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు


గోపాలపట్నం హైస్కూల్‌లో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గోపాలపట్నం: మండల స్థాయి వ్యాసరచన పోటీలు గోపాలపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం రైతుకు ఏవిధంగా ఉపయోగ పడతుందన్న అంశాలపై జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఇందులో 13 పాఠశాలల నుంచి 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను బాబూరావు మాస్టారు, జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ పర్యవేక్షించారు.

చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచాలి


అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సీడీపీవో రమణకుమారి

గోపాలపట్నం: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు చదువుపై ఆసక్తి పెరిగేలా నడుచుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి అన్నారు. అంగన్వా కార్యకర్తలకు పోషణ్ బి- పడాయి బీ కార్యక్రమంపై హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో సామర్థ్యం పెంచడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చినగదిలి, గోపాలపట్నం, ములగాడ మండలాల్లో ఉన్న 150 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు. 0 నుంచి 3 ఏళ్ల పిల్లలకు నవ చేతన అని, 3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు ఆధారశిల అని నామకరణం చేసినట్టు చెప్పారు. పోషణ స్థాయి పెంచడం, చిన్నారుల్లో విద్యపై ఆసక్తిని పెంచడం, నేర్పరితనాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలకు సహకరించినా కఠిన చర్యలు

జిల్లా జడ్జి షణ్ముఖరావు


అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి షణ్ముఖరావు

గాజువాక: బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తించే వారితోపాటు వారికి సహకరించినవారిపై కూడా కఠిన చర్యలు తప్పవని 13వ జిల్లా అదనపు జడ్జి జి.షణ్ముఖరావు పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కణితి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలపట్ల ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే టీచర్లకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పిల్లలు సోషల్ మీడియాకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. వాటిని ఎప్పుడు, ఏ సమయంలో ఉపయోగించుకోవాలో వివరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వి.వినోద్ కుమార్, ఎంఈవో సునీత తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అమోఘం


కార్మికులను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కార్మికులు చేసిన కృషి అమోఘమైనదని యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ అన్నారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి లోని యూనియన్ పాయింట్ వద్ద మంగళవారం ఈనెలఖారున పదవీ విరమణ చేయనున్న, వీఆర్‌ఎస్ తీసుకున్న కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో చేరిన కార్మికులు అనేక ఆటుపోట్లు ఎదుర్కొని ప్లాంట్‌ను నిలబెట్టారన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితిలో యాజమాన్యం కార్మికుల పట్ల అనుసరిస్తున్న వైఖరి దుర్మార్గంగా ఉందన్నారు. ఉద్యోగులకు సక్రమంగా జీతాలు కూడా ఇవ్వకుండా వేధిస్తుందన్నారు. యూనియన్ చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ పదవీ విరమణ చేస్తున్న కార్మికులు ఇకపై తమ కుటుంబాల కోసం జీవితం గడపాలన్నారు. కార్యక్రమంలో బి.ఎన్. రాజు, రమణమూర్తి, కారు రమణ, మద్ది అప్పలరాజురెడ్డి, కొమ్ము ప్రసాద్, ఎన్. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్కాపురం: పెయింటింగ్ పనులు చేస్తూ జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీనిపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 63వ వార్డు చింతల్లోవ ప్రాంతానికి చెందిన సంగిరెడ్డి రామకృష్ణ (25) పెయింటింగ్ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నాడు. దీనిలో భాగంగా ఓ భవనం రెండో అంతస్తు డూమ్ వద్ద తాడు కట్టుకుని పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. రామకృష్ణ కట్టుకున్న తాడు జారకుండా అదే ప్రాంతానికి చెందిన కె.కిరణ్ పట్టుకున్నాడు. ఇది ఇలా ఉంటే పని చేస్తున్న సమయంలో హెల్పర్ కిరణ్‌కు ఫోన్ రావడంతో ఓ చేతితో తాడు పట్టుకుని, మరో చేతితో ఫోన్ మాట్లాడాడు.ఈ క్రమంలో తాడు జారడంతో రామకృష్ణ రెండో అంతస్తు నుంచి జారి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో తోటి కార్మికులు,కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపారు.

ఏయూ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత


శివాజీ పాలెంలో పర్యటిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. రిజిస్ట్రార్ ధనుంజయరావు, రెక్టార్ కిశోర్ బాబు సంబంధిత విభాగాల అధికారులతో కలిసి శివాజీ పాలెంలోని ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఫైన్ ఆర్ట్స్ కాలేజీలను సందర్శించారు. ఆయా ప్రాంగణాల్లో విద్యార్థులు వేసిన శిల్పాలు, వివిధ కళాకృతులను తిలకించారు. శివాజీ పాలెంలో ఉన్న వర్సిటీ ఆచార్యుల నివాస సముదాయాలను, ఇంజినీరింగ్ విద్యార్థినుల వసతి గృహాన్ని పరిశీలించారు. అదే విధంగా ఇంజినీరింగ్ కాలేజీ మైదానం అంతా చూసి, వాటికి సరిహద్దులు ఎక్కడున్నాయనేది సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏయూ ఆస్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

పండగ మహోత్సవాల కరపత్రం విడుదల


కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమచల్‌నగర్‌లో కొలువుదీరిన నూకాలమ్మ వారి పండగ మహోత్సవ కరపత్రాన్ని ఆలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. వచ్చే నెల 13న అమ్మవారి పండగ సందర్భంగా నెల రోజుల పాటు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టును సందర్శించిన డీఆర్ఎం


గంగవరం పోర్టులో తనిఖీలు నిర్వహిస్తున్న వాల్తేర్ డీఆర్ఎం లలిత్‌బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఉన్నతస్థాయి అధికారుల బృందంతో కలిసి మంగళవారం అదాని గంగవరం పోర్టును సందర్శించారు. పోర్టులో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల ప్రాజెక్టులు, కీలక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అదాని గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వ్యాపారాభివృద్ధి కోసం చేపట్టవలసిన విషయాలు, ఇరువురి మధ్య అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించి, రైల్వే అధికారులు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌కు కట్ మోడల్ ఇంజిన్ వితరణ


సమావేశంలో మాట్లాడుతున్న కెనడీ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యార్థులు ప్రయోగాలకు ఉపయోగపడేందుకు ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కట్ మోడల్ డీజిల్ ఇంజిన్‌ను వితరణ చేసింది. ఈమేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కంపెనీ మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ కెనడీ డీజిల్ ఇంజిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ఇసుజు మోటార్స్ కంపెనీ అంతర్జాతీయంగా వందేళ్ల చరిత్ర కలిగిందన్నారు. కంపెనీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రయోగాత్మక విజ్ఞానాన్ని పొందేందుకు వీలుగా ఇంజిన్ అందజేశామన్నారు. కంపెనీ లీగల్ డిపార్టుమెంట్ సీనియర్ మేనేజర్ శుక్లా మాట్లాడుతూ విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఇష్టంతో కష్టపడాలన్నారు. హెచ్ఆర్ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉన్నవారికి మాత్రమే ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. సమావేశంలో మెకానికల్ హెడ్ మధుకుమార్, మెకానికల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేల్కోకుంటే ముప్పే!

- గోపాలపట్నం హైస్కూల్‌లో విరిగిన చెట్ల కొమ్మలు
- అదృష్టం కలిసొచ్చి ఆదివారమే ఘటనలు


విరిగిన చెట్ల కొమ్మలు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో నీడనిచ్చే చెట్లు ఇప్పుడు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఎండిన కొమ్మలు విరిగి పడుతున్నాయి. ఎండలు ముదురుతున్న వేల చెట్టు నీడకు వెళ్లామంటే భయమేస్తోందని విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

అదృష్టం కలిసొచ్చి ..

పాఠశాల ఆవరణలో బాగా వయసు పెరిగిన మామిడి చెట్ల కొమ్మలు ఒక్కసారిగా విరిగి పడుతున్నాయి. ఇప్పటికే పలు కొమ్మలు నేల కొరిగినా ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోలేదు. రెండు మార్లు ఆదివారాల్లో మధ్యాహ్నం సమయంలో కూలడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎండిన కొమ్మలు తొలగించేందుకు చర్యలు

పాఠశాల ఆవరణలో పెద్ద మామిడి చెట్లు ఉన్నాయి. ఇవి సరిగ్గా పాఠశాల స్టాఫ్ రూమ్, తరగతి గదుల సముదాయాలకు, వంటగది, భోజనశాలకు ఆనుకుని ఉన్నాయి. ఈ చెట్లకు ఎండిన కొమ్మలు ఉండడంతో చిన్నపాటి గాలులకు పడిపోతున్నాయి. అయితే పాఠశాలలో ఎవరూ లేని సమయాల్లో కూలడం అదృష్టమంటూ చెప్పుకుంటున్నారు. దీంతో ఎండిన కొమ్మలు తొలగించేందుకు పాఠశాల ఉపాధ్యాయులు స్కూల్ కమిటీ సభ్యులతో చర్చిస్తున్నారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా తగిన చర్యలు చేపడుతున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.


గోపాలపట్నం హైస్కూల్ ప్రాంగణంలో నీడనిచ్చే చెట్లు

చర్యలు తీసుకోండి

పిల్లలకు ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోక ముందే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు. సెలవు ప్రకటించి అయినా ప్రమాదకరంగా ఉన్న కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు.